క్లుప్తంగా

ఆస్పత్రి కోసం సంతకాల సేకరణ



సంతకాలు సేకరిస్తున్న సంఘాల నాయకులు

ఇల్లంతకుంట: మండల కేంద్రంలో 30 పడకల ఆస్పత్రి మంజూరు చేయాలని మండల యువజన సంఘాల నాయకులు ఆదివారం మండలంలోని రేపాక గ్రామంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల యువజన సంఘాల అధ్యక్షుడు బెంద్రం తిరుపతిరెడ్డి, మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ 30 పడకల ఆస్పత్రి మంజూరు చేస్తానని చెప్పి 59 మాసాలు పూర్తి కావస్తున్న ఇప్పటి వరకు మంజూరు చేయలేదని, మంజూరు చేసేంత వరకు ఆందోళనలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లేశ్, స్వామి, రంజిత్, లక్ష్మణ్, రవి, కనుకయ్య, అనీల్, శేఖ్, అనీల్, భాను, శ్రీనివాస్, రాంరెడ్డి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎల్లారెడ్డి

కోనరావుపేట: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి అన్నారు. ఆదివారం మధ్యాహ్న భోజన కార్మికులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తయారు చేస్తున్న కార్మికులకు కోడిగుడ్ల బిల్లులు సక్రమంగా ఇవ్వడం లేదని, అలాగే వేతనాలు కూడా సకాలంలో రావడంలేదని అన్నారు. కార్మికులకు వేతనాలు సక్రమంగా చెల్లించినట్లయితే భోజనాన్ని మరింతగా నాణ్యతతో తయారు చేసే అవకాశం ఉందన్నారు. కొన్నేళ్లుగా కార్మికులకు సిలిండర్లు ఇవ్వడంలేదని, కార్మికులకు సిలిండర్లు సరఫరా చేయాలన్నారు. 9, 10 తరగతుల విద్యార్థులకు రేషన్ పెంచాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జవ్వాజి విమల, సభ్యులు లాల లక్ష్మి, పిట్టల సత్తవ్వ, నర్సవ్వ, పద్మ, పోషమల్ల అన్నవ్వ, బద్దెపూరి సత్తవ్వ, ఇస్తారి అనూష, దేవవ్వ, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి

గంభీరావుపేట: బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని, ఇంటింటికీ కేంద్ర ప్రభుత్వ పథకాలను తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లగిశెట్టి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడిగా గంట అశోక్, జిల్లా అధికార ప్రతినిధి దేవసాని కృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు వేశారు సెంట్రల్ లైటింగ్ మరిచారు

- రాత్రివేళ చిమ్మ చీకట్లు
- ఇబ్బందిపడుతున్న ప్రయాణికులు
- రోడ్డు దాటాలంటే జంకుతున్న స్థానికులు

వేములవాడఅర్బన్: సిరిసిల్ల జిల్లా కేంద్రం కావడంతో ప్రయాణికుల రద్దీ పెరిగింది. గతంలో ఏదైనా పని ఉంటే మాత్రమే సిరిసిల్లకు వెళ్లేవారు. ఇప్పుడు ప్రతి జిల్లా కార్యాలయాలకు సంబంధించిన పనిమీద ప్రజలు సిరిసిల్లకు వెళ్లక తప్పదు. దీంతో సిరిసిల్లకు రాత్రి పగలు తేడా లేకుండా వాహనాలు నడుస్తున్నాయి. వాహనాల రద్దీని గమనించిన అధికారులు, ప్రభుత్వం వేములవాడ-సిరిసిల్ల వరకు ఫోర్‌వే లేన్ వేశారు. రోడ్డు మధ్యలో డివైడర్ కూడా ఏర్పాటు చేశారు. ఇటీవల మళ్లీ దానిపై రోడ్డు పోశారు. డివైడర్ మధ్యలో యూటర్న్ వద్ద, రోడ్డు మధ్యలో రేడియం స్టిక్కర్ వేశారు. అన్ని బాగానే ఉన్న రోడ్డు మధ్యలో సెంట్రల్ లైటింగ్ మరిచారు.



సిరిసిల్ల - వేములవాడ రహదారి

జంట పట్టణాలు..

సిరిసిల్ల-వేములవాడ మధ్యలో రగుడు జంక్షన్ సమీపంలో కలెక్టర్ కార్యాలయల సముదాయాలు ఏర్పాటు చేశారు. దీంతో వేములవాడ-సిరిసిల్ల రెండు జంట పట్టణాలుగా మారాయి. నిత్యం జిల్లాకు వచ్చే ప్రజలు, అధికారుల వాహనాల రద్దీ పెరిగింది. దీంతో వేములవాడ నందికమాన్ నుంచి సిరిసిల్ల రగుడు చౌరస్తా వరకు రోడ్డును ఫోర్‌వే లేన్‌గా మార్చారు. ఇటీవల డివైడర్ మధ్యలో అందంగా పూలమొక్కలను నాటారు.

సెంట్రల్ లైటింగ్ లేదు..

సిరిసిల్ల రగుడు జంక్షన్ నుంచి వేములవాడ నందికమాన్ మీదుగా కొడుముంజ వరకు డివైడర్ మధ్యలో సెంట్రల్ లైటింగ్ లేకపోవడంతో రాత్రి వేళ వాహనదారులకు ఇబ్బందిగా మారింది. ముందు వెళ్లే వాహనాలు కనిపించక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు తెలిపారు. అధికారులు పట్టించుకుని రోడ్డు డివైడర్ మధ్యలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



సిరిసిల్ల-వేములవాడ రహదారి రాత్రివేళ

రోడ్డు దాటాలంటే భయం

రగుడు నుంచి కొడుముంజ వరకు గ్రామాలు చంద్రగిరి, తెట్టకుంట, చీర్లవంచ, గుర్రవానిపల్లి, నందికమాన్ చౌరస్తా, కొడుముంజ గ్రామాలు రోడ్డును అనుకుని ఉన్నాయి. దాంతో రాత్రివేళ స్థానికులు నడుచుకుంటూ చీకటిలో రోడ్డు దాటాలంటే భయందోళనకు గురవుతున్నారు. చీకట్లో వ్యక్తి కనిపించక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, కనీసం రోడ్డుకు దగ్గరగా ఉన్న గ్రామాలు ఉన్న ప్రాంతంలోనైనా సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని కోరుతున్నారు.

రోడ్డుపై వెళ్లాలంటే భయంగా ఉంది



మాది సిరిసిల్ల.. నేను ప్రతిరోజు సిరిసిల్ల నుంచి వేములవాడకు కూలి పనికి వచ్చి రాత్రి 9 గంటలకు వెళ్తుంటాను. రోడ్డుపై ద్విచక్ర వాహనం మీద రాత్రి వెళ్లాలంటే చిమ్మ చీకటిగా ఉంటుంది. రోడ్డు మధ్యలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– రవి, సిరిసిల్ల

రోడ్డు దాటడం కష్టం



వేములవాడ మండలం అగ్రహారం వద్ద సిరిసిల్ల-వేములవాడ రహదారి డివైడర్ మధ్యలో సెంట్రల్ లైటింగ్ లేకపోవడంతో రాత్రివేళ పాదచారులు రోడ్డు దాటలంటే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి.

– శ్రీనివాస్‌రెడ్డి, చీర్లవంచ

సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి



సిరిసిల్ల-వేములవాడ రహదారిలోని కొడుముంజ శివారులో రహదారి డివైడర్ మధ్యలో సెంట్రల్ లైటింగ్ లేకపోవడంతో ఇటీవల డివైడర్ చివరకు లారీ డివైడర్‌ను ఢీకొట్టింది. ప్రమాదాలు జరుగుతున్నాయని ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు.

– ప్రశాంత్‌గౌడ్, కొడుముంజ

మానవ హక్కుల పరిరక్షణకు కృషి

- నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు రాపత్తి భూపతి

సిరిసిల్లటౌన్: మానవ హక్కుల పరిరక్షణకు నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ పనిచేస్తుందని జిల్లా అధ్యక్షుడు రాపత్తి భూపతి అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎలాంటి సమస్యలున్న బాధితుల తరుపున పోరాడి వారికి సత్వర న్యాయం అందేలా చేయడమే సంస్థ లక్ష్యమన్నారు. అనంతరం పలు మండలాల అధ్యక్షులను నియమించి కార్డులను అందజేశారు. వేములవాడ అధ్యక్షుడుగా ఎగుర్ల అనిల్, కోనరావుపేట చెర్లపల్లి వామన్, బోయిన్‌పల్లి పినమని శ్రీనివాస్‌లను నియమించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కీసరి లక్ష్మణ్, కార్యదర్శి ప్రేమ్‌సాగర్, లీగల్ అడ్వైజర్ కీసరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భూపతి

అ'పూర్వ' సమ్మేళనం

కోనరావుపేట: మండలం మామిడిపల్లిలోని శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయంలో 2003–04 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమావేశాన్ని నిర్వహించారు. చిన్నప్పుడు పాఠశాలలో కలిసిన విద్యార్థులందరూ మళ్లీ సుమారు 20 సంవత్సరాలకు కలుసుకుని ఆప్యాయంగా పలకరించుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.



చిత్రకథ



పందులు.. కుక్కల సంచారం

వేములవాడ: పట్టణంలో పందులు, కుక్కలు విపరీతంగా పెరిగాయి. అధికారులు అడపా.. దడపా చర్యలు తీసుకుని వదిలేస్తుండటంతో పందుల పెంపకందారులు వీధుల్లోనే తమ పందులను పెంచుకుంటున్నారు. దీంతో పందుల బెడద పెరిగిపోతుందని కాలనీవాసులు అంటున్నారు. కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తూ జనాలపై దాడులకు పాల్పడుతున్నాయి. మున్సిపల్ అధికారులకు, కౌన్సిలర్లకు ఎన్నిసార్లు చెబుతున్నా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదంటూ సాయినగర్ వాసులు ఆరోపిస్తున్నారు. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని పందులు, కుక్కల బారినుంచి జనాల్ని రక్షించాలని కోరుతున్నారు.

ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో రాణించాలి

- ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పర్శ హన్మాండ్లు
- మల్లారెడ్డిపేటలో ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళనం

గంభీరావుపేట: ముదిరాజ్‌లు విద్య, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక రంగాల్లో రాణించాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు పర్శ హన్మండ్లు అన్నారు. గంభీరావుపేట మండలం భీముని మల్లారెడ్డిపేటలో ఆదివారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన హన్మండ్లు మాట్లాడుతూ ముదిరాజ్‌ల సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తానన్నారు. జనాభా ప్రాతిపదికన ముదిరాజ్‌లకు రాజ్యాధికారంలో వాటా దక్కాలన్నారు. ముదిరాజ్‌లను బీసీ'డీ' గ్రూప్ నుంచి బీసీ'ఏ'లోకి మార్చాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. చట్ట సభలలో రిజర్వేషన్లు కల్పించాలని, ముదిరాజ్‌ల కోసం ప్రత్యేక శాఖ ఏర్పాటు చేయాలని కోరారు. మంత్రి కేటీఆర్ కృషితో సిరిసిల్ల నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. మండల శాఖ అధ్యక్షుడు రమేశ్, నాయకులు దేవేందర్, రాజేందర్, దేవయ్య, సుతారి బాలవ్వ, రమేష్, అంజయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పర్శ హన్మాండ్లు

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలి

- కమ్యూనిటీ పోలీసింగ్‌పై అవగాహన

వీర్నపల్లి: ఇంటర్‌నెట్ వినియోగం ఎక్కువగా ఉన్న తరుణంలో సైబర్ నేరాలు ఎక్కువయ్యాయని, వీటిపై అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని ఏఎస్‌ఐ కిషన్‌రావు అన్నారు. మండల కేంద్రంలో కమ్యూనిటీ పోలీసింగ్ వర్టికల్ అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యంగా ఆన్‌లైన్ ద్వారా లావాదేవీలు నడిపేవారు కొత్త వ్యక్తుల మాటలను నమ్మరాదని, తెలియని మెసేజ్‌లపై క్లిక్ చేయరాదని తెలిపారు. సైబర్ నేరగాళ్లు మాయమాటలు చెప్తూ బహుమతులు వచ్చాయని, లాటరీ తగిలిందని, లోన్లు ఇస్తామని, ఆశ చూపి ఆన్‌లైన్ ద్వారా డబ్బులకు ఎరవేస్తారని, అటువంటి వ్యక్తులు పంపే మెసేజ్‌లకు స్పందించవద్దని అన్నారు. మహిళలు ఫోన్ చేసి వారి మాయమాటలతో మగవారిని నమ్మించి మోసం చేస్తున్నారు. అలాంటి ఫోన్లకుస్పందించవద్దు అన్నారు. అనుకోకుండా సైబర్ నేరగాళ్ల బారిన పడి డబ్బులు పోగొట్టుకుంటే, తక్షణమే 155260కు ఫోన్ చేసి డబ్బులు పోగొట్టుకున్న విషయం ఫిర్యాదు చేయాలన్నారు. మీ అకౌంట్‌లో డబ్బులు పోయిన 24 గంటల లోపుగా ఫిర్యాదు చేస్తే పోగొట్టుకున్న డబ్బులు వెనక్కి వచ్చే అవకాశం ఉంటుందన్నారు.స్మార్ట్‌ఫోన్లు వాడే పిల్లల తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మద్యం తాగి వాహనం నడిపిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. పిల్లలకు వాహనాలు ఇస్తే వాహనదారుడిపై కేసు నమోదు చేస్తామని తెలిపారు.



అవగాహన కల్పిస్తున్న ఏఎస్‌ఐ కిషన్ రావు

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల పట్టణంలోని 19వ వార్డులో బొద్దుల భాస్కర్‌కు మంజూరైన రూ.2 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఆదివారం కౌన్సిలర్ అన్నారం శ్రీనివాస్ అందజేశారు.

కోనరావుపేట: అనారోగ్యంతో చికిత్స పొందుతున్న మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన కట్ల పర్శయ్యకు రూ. 20 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బొడ్డు చంద్రయ్య పాల్గొన్నారు.

కూలీలకు వసతులేవీ?

- పని ప్రదేశాల్లో కానరాని టెంట్లు
- అందుబాటులో లేని మెడికల్ కిట్లు
- నీరు ఇంటి నుంచి తెచ్చుకునుడే

ఇల్లంతకుంట: ఉపాధిహామీ కూలీలకు పని ప్రదేశాల్లో ప్రభుత్వం కల్పించాల్సిన వసతులు ఎక్కడ కానరావడం లేదు. ఇల్లంతకుంట మండలంలోని 33 గ్రామాల్లో ప్రతిరోజు రూ.1500 నుంచి రూ.2000 మంది వరకు ఉపాధిహామీ పనికి వెళ్తున్నారు. వేసవికాలం కావడంతో ఎండల తీవ్రత పెరగడంతో ఉదయం 7 గంటల నుంచే ఎండ ప్రభావం ఉంటుంది. ఉపాధిహామీ పనులు జరిగే పని ప్రదేశాల్లో కూలీలకు ఏదైనా అపాయం జరిగితే అత్యవసరంగా ప్రథమ చికిత్స అందించేందుకు మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలి, కాని ఇప్పటి వరకు మెడికల్ కిట్లు ఎక్కడా కూడా కానరావడం లేదు. ఎండల నుంచి కాసేపు ఉపశమనం పొందేందుకు కూలీలు నీడన కూర్చునేందుకు పని ప్రదేశంలో టెంట్లు, గుడారాలు ఏర్పాటు చేయాలని, కాని మండలంలోని గ్రామాల్లో ఎక్కడ కూడా ఏర్పాటు చేయకపోవడంతో కూలీలు ఎర్రటి ఎండలోనే పనులు చేస్తున్నారు. ఎక్కడైనా చెట్లు కనిపిస్తే వెళ్లి కూర్చోవాల్సి వస్తుందని కూలీలు చెబుతున్నారు. ప్రభుత్వం ఉపాధిహామీ కూలీలకు అన్నీ సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.



ఉపాధిహామీ పనుల్లో కూలీలు


పెరగనున్న కూలీల సంఖ్య

ఇల్లంతకుంట మండలంలోని 33 గ్రామాల్లో మొత్తం 10,500 జాబ్‌కార్డులుండగా, 18 వేల వరకు కూలీలు ఉన్నారు. ప్రస్తుతం ఈ ఏప్రిల్ రెండో వారంలో ప్రతిరోజు 1500ల నుంచి 2000ల మంది కూలీలు ఉపాధిహామీ పనులకు వస్తున్నారని, ఈనెలాఖరు వరకు ప్రతిరోజు 6 వేల నుంచి 8 వేల మంది వరకు కూలీలు ఉపాధిహామీ పనులకు వచ్చే అవకాశం ఉందని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

సదుపాయాలు నిల్

ఉపాధిహామీ పనులు జరిగే ప్రదేశంలో కూలీలకు మెడికల్ కిట్లు, ఎండ తీవ్రతకు సేదతీరేందుకు టెంట్లు, తాగునీటి సదుపాయం కల్పించాల్సి ఉంటుంది. కాని ఇవేమి సదుపాయాలు కల్పించకపోవడంతో కూలీలు పనులకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఉపాధిహామీ కూలీలకు పని ప్రదేశాల్లో అన్ని సదుపాయాలు కల్పించాలని కూలీలు కోరుతున్నారు.


ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాం



ఉపాధిహామీ పనులు జరిగే ప్రాంతాల్లో కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాం. మంచినీరు కూలీలు తెచ్చుకుంటే వారి అకౌంట్లలో ప్రభుత్వం డబ్బులు జమ చేస్తుంది. ఇక పని ప్రదేశాల్లో టెంట్లు మాత్రం ఏర్పాటు చేయడం లేదు. ప్రభుత్వం నుంచి షేడ్ నెట్లు రాగానే ఏర్పాటు చేస్తాం.

– పి.చంద్రయ్య, ఏపీవో, ఇల్లంతకుంట

పని ప్రదేశాల్లో సదుపాయాలు కల్పించాలి



వేసవికాలం కూలీలు పనులు చేయాలంటేనే ఇబ్బంది ఉంటుంది. పని ప్రదేశాల్లో టెంట్లు, మంచి నీటి సదుపాయం, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలి. కూలీలు ఎండ తీవ్రతతో ఇబ్బందులు పడుతున్నారు. కలెక్టర్ స్పందించి ఉపాధిహామీ కూలీలకు పని ప్రదేశాల్లో సదుపాయాలు కల్పించాలి.

– గన్నారం నర్సయ్య, పెద్దలింగాపూర్

పవర్ కట్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ ఏఈఈ దివ్య ఒక ప్రకటనలో తెలిపారు. స్థానికంగా సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులు ఉండడం వల్ల ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నట్లు వివరించారు. ఇందుకు వినియోగదారులు, రైతులు సహకరించాలని ఆమె కోరారు.

సమాచారం

నేడు బోయినపల్లి మండల సర్వసభ్య సమావేశం

బోయినపల్లి: మండల సర్వ సభ్య సమావేశం సోమవారం ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నల్లా రాజేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఆయా శాఖల అధికారుల తమ శాఖల ప్రగతి నివేదికలతో హాజరు కావాలని కోరారు. అలాగే ఎంపీటీసీలు, సర్పంచులు హాజరు కావాలని పేర్కొన్నారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

సిరిసిల్లకల్చరల్: వచ్చే విద్యాసంవత్సరం హైదరాబాద్ బేగంపేట పబ్లిక్ స్కూల్‌లో ఒకటో తరగతిలో ప్రవేశాల కోసం అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. రెండు లక్షలకు మించని వార్షికాదాయం, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఆసక్తి గల ఎస్సీలు ఈ సీటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. మే 1 లోపు జిల్లా ఎస్సీడీవో కార్యాలయంలో అందిన దరఖాస్తుల నుంచి లాటరీ విధానంలో సీటుకు ఎంపిక జరుగుతుందన్నారు.

సంఘాలు - ఎన్నికలు

సైకాలజిస్టుల సంఘం కార్యవర్గం

సిరిసిల్లటౌన్: రాజన్న సిరిసిల్ల జిల్లా సైకాలజిస్టుల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సైకాలజిస్టుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కనుకుంట్ల పున్నంచందర్ హాజరయ్యారు. జిల్లా అధ్యక్షుడిగా ఆడేపు వేణు, ప్రధాన కార్యదర్శిగా అలువాల ఈశ్వర్, ఉపాధ్యక్షులుగా ఆంజనేయులు, నాగజ్యోతి, కోశాధికారిగా దాసరి తిరుమల, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా చొప్పదండి శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీగా పరమేశ్వర్, మీడియా సెక్రెటరీగా అయ్యప్ప రాము, ఎగ్జిక్యూటీవ్ మెంబర్స్ కృష్ణహరి, చంద్రమౌళి, నరేందర్, శ్రీనివాస్, శేఖర్, శ్రీకాంత్ ఎన్నికయ్యారు.

'గోపా' జిల్లా అధ్యక్షుడిగా అమరేందర్‌గౌడ్

సిరిసిల్లఅర్బన్: రాజన్న సిరిసిల్ల జిల్లా గౌడ ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) అధ్యక్షుడిగా కంచర్ల అమరేందర్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సిరిసిల్లలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లా గోపా సర్వసభ్య సమావేశంలో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా విక్రుత్తి లక్ష్మీనారాయణగౌడ్, కోశాధికారిగా పదిర బాలరాజ్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు అమరగోని నర్సయ్యగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, సత్యనారాయణగౌడ్ ప్రకటించారు. కార్యక్రమంలో గోపా రాష్ట్ర అధ్యక్షుడు మద్దెల రమేష్‌బాబుగౌడ్, ఉపాధ్యక్షుడు ముద్దగోని రామ్మోహన్‌గౌడ్ పాల్గొన్నారు.

ఇద్దరిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు

ముస్తాబాద్: ముస్తాబాద్‌లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి వుండాలని, మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం

ఎల్లారెడ్డిపేట: ప్రహరీ కూలి మృతిచెందిన తల్లీకూతుళ్లు దొమ్మాటి దేవవ్వ, అక్షయ కుటుంబానికి సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. ఆదివారం పరామర్శించి ప్రభుత్వపరంగా ఆదుకుంటామన్నారు.